క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పీర్ల నిమజ్జనం



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ముస్లిం మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మొహర్రం నెల ప్రారంభం సందర్భంగా ఈ నెల 7వ తేదీ నుంచి వివిధ ప్రాంతాల్లోని పంజాలు, ఆస్థానాల్లో ప్రతిష్ఠించిన పీర్ల నిమజ్జన కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆయా పంజాలు, ఆస్థానాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్లను పూలమాలతో అలంకరించి కుండీ సెంటర్‌లోని గొలుసుల పంజా వరకు ఏలూరు పీర్ల పంజా కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. గడియార స్తంభం, బిర్లా భవన్ సెంటర్ చందన సెంటర్, పాత బస్టాండుల మీదుగా సాగిన ఊరేగింపు పాతబస్టాండు సమీపంలోని కర్బలా మైదానంలో నిమజ్జనం చేశారు. వివిధ పంజాల ముజావర్లు, ఏలూరు పీర్ల పంజా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆరా



యాదవ నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టౌన్ : 49వ డివిజన్ యాదవ నగర్‌లో రోడ్లు, డ్రెయినేజీల సమస్యలపై ఎమ్మెల్యే బడేటి చంటి ఆరా తీశారు. బుధవారం ఆయన ఆప్రాంతంలో పర్యటించారు. డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగునీటి పారుదల లేక వర్షాలకు మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని స్థానికులు తెలిపారు. వర్షాలు తగ్గిన వెంటనే డ్రెయిన్‌లో పూడిక తీయిస్తానమని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, నగర పాలక సంస్థ ఎంఈ కొండలరావు, మాజీ డిప్యూటీ మేయర్ నెరుసు సుగుణ గంగరాజు ఉన్నారు.

నగరాభివృద్ధికి ప్రణాళిక

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక పనిచేస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు పేర్కొన్నారు. బుధవారం మేయర్ నూర్జహాన్ స్వగృహంలో నగరాభివృద్ధిపై చర్చించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాస్, బత్తిన విజయ్‌కుమార్, దేవరకొండ శ్రీనివాస్, ఈదుపల్లి పవన్, నాయకులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు ధర

- అదే బాటలోనే చికెన్
- సామాన్యులకు అందని వైనం



ఏలూరు టౌన్ : కోడిగుడ్డు ధర కొండెక్కి కూర్చుంది. ఓ వైపు కూరగాయలు గాయాలు చేస్తున్నాయి. మొన్నటి వరకు పప్పు కంటే చికెన్ బెస్ట్ అన్న వారందరూ ఇప్పుడు ముక్కలు కంటే ఆకు కూరలు బెస్ట్ అంటున్నారు. కోడిగుడ్డు ధరలు, చికెన్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. బహిరంగ మార్కెట్‌లో రిటైల్‌గా కోడిగుడ్డు రూ.7లకు విక్రయిస్తున్నారు. మారుమూల గ్రామాల్లో అయితే రూ.8లకు అమ్ముతున్నారు. 30 కోడిగుడ్ల అట్ట ధర రూ.200లకు అమ్ముతున్నారు. 10 రోజుల క్రితం రూ.180లు ఉన్న అట్ట ఒక్కసారిగా పెరిగింది. నిలకడ లేకుండా ప్రతిరోజు గుడ్డు ధర 5 పైసల నుంచి 15 పైసల వరకు పెరుగుతుంది. ఇది మరింత పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

పెరిగిన డిమాండ్

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు కూడా గుడ్లు ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతోన్న మధ్యాహ్న భోజన పథకంలో వారానికి 5 రోజులు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ప్రతిరోజూ గుడ్డును విద్యార్థులకు అందిస్తున్నారు. పల్లెలు, పట్టణాలు, నగరాల్లో నూడిల్స్ బండ్లు, ఆమ్లెట్లు పెరగడంతో వీటి వాడకం పెరిగింది. ఈ నేపథ్యంలో కోడిగుడ్డుకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి పెరగకపోవడంతో ధర పెరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. సామాన్యులకు తక్కువ ధరకు లభించే పౌష్టికాహారం కోడిగుడ్డు, ఇప్పుడు కోడిగుడ్డు ధర రోజురోజుకు పెరుగుతుండటంతో గుడ్డును కొనాలంటే సామాన్యులు ఆలోచిస్తున్నారు. కోడిగుడ్డు ధరలతో పాటు కూరగాయల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయి. అలాగే చికెన్ ధర కూడా కిలో రూ.260లకు చేరింది. దీంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. కోడిగుడ్డు ధర తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్‌లోకి అంగన్‌వాడీ గుడ్లు

ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీల ద్వారా కోడిగుడ్లు అందజేస్తున్నారు. పౌష్టికాహారాన్ని అందజేయడంలో భాగంగా పాల పదార్థాలతో పాటు గుడ్లను సరఫరా చేస్తున్నారు. కాని అంగన్‌వాడీల్లో అందించే కోడిగుడ్లు మార్కెట్‌లోకి వస్తున్నాయని చెబుతున్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు ఇవ్వాల్సిన కోడిగుడ్లు మార్కెట్‌లో విక్రయించుకుంటూ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసే గుడ్లపై ముద్ర వేసి అందిస్తారు. ఈ గుడ్లపై ఉన్న ముద్రలను చెరిపివేసి మార్కెట్‌లోకి విక్రయిస్తున్నారని చెబుతున్నారు. ఒకవైపు మార్కెట్‌లో కోడిగుడ్లు ధరలు పెరిగిపోతుండగా ఉచితంగా ప్రభుత్వం అందించే కోడిగుడ్లు లబ్ధిదారులకు చేరకుండా మార్కెట్‌లోకి వెళ్లడంతో విమర్శలు వస్తున్నాయి. అధికారులు పర్యవేక్షణ లోపంతోనే ఇలా దొడ్డిదారిన అంగన్‌వాడీ కేంద్రాల నుంచి మార్కెట్‌లోకి కోడిగుడ్లు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు.

కోడిగుడ్లకు కృత్రిమ డిమాండ్



వర్షాకాలంలోనూ కోడిగుడ్ల ధరలు భారీగా పెరుగుతున్నాయి. సామాన్యులకు గుడ్డు సైతం అందుబాటులో లేకపోవడం దారుణం. చికెన్ ధరలు కూడా భారీగా పెరిగిపోవడంతో సామాన్యులు పౌష్టికాహారాన్ని తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. కావాలనే వ్యాపారులు కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ రేట్లు పెంచుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జిజ్జువరపు విజయనిర్మల, కార్పొరేటర్, ఏలూరు వన్‌టౌన్

చేనేత సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలి

ఏలూరు (టూటౌన్): చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జౌళి శాఖ నుంచి చేనేతను విడదీసి రాష్ట్ర బడ్జెట్లో చేనేతకు రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని, చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వ బకాలయిలను చెల్లించి ఆదుకోవాలని పేర్కొన్నారు. చేతి వృత్తులను పరిరక్షించేందుకు ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. 11 రకాల చేనేత వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని, చేనేతలకు ప్రత్యేక బ్యాంకులను ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. అర్హులైన చేనేత కార్మికులు మూడు సెంట్లు స్థలం మంజూరు చేసి పక్కా గృహం, వర్క్ షెడ్‌ను ఉచితంగా నిర్మించి ఇవ్వాలని, సిల్క్ రాయితీని రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచి ఇవ్వాలని, చేనేతకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించాలని, నేతన్న నేస్తాన్ని రూ.36 వేలకు పెంచి మగ్గం నేసే ప్రతి కార్మికునికి, ఉపవృత్తుల వారికి వర్తింప చేయాలని కన్నయ్య డిమాండ్ చేశారు.

చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స



చిన్నారులను పరామర్శిస్తున్న కృష్ణారెడ్డి

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవన్‌లో తలసేమియా బాధిత చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి చికిత్స అందించారు. వారిని రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి పరామర్శించారు. తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా బాధిత చిన్నారుల కోసం ఆరోగ్యంగా ఉన్న యువకుల నుంచి రక్తాన్ని సేకరించేందుకు జిల్లాలోని డిగ్రీ, పీజీ కళాశాలల వద్ద ఆధునిక పరికరాలతో ఏసీ మొబైల్ బ్లడ్ కలెక్షన్ బస్సును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చిన్నారుల సహాయకులు 25 మందికి సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అడుసుమిల్లి సత్యనారాయణ మధ్యాహ్న భోజనాన్ని, కె.రామ్‌శ్రీ భాస్కర్, మోతే అనుపమ పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కేబీ సీతారామ్, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, బీఆర్‌సీహెచ్ నారాయణ, డాక్టర్ జి.స్పందన, లయన్స్ జిల్లా ఉమెన్ లీడర్ కె.పద్మావతి తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పాతబస్టాండ్ సెంటర్‌లోని శ్రీ పాండురంగ స్వామి ఆలయంలో స్వామి వారికి పరశురామ అలంకరణ చేశారు. దొండపాడు శ్రీ నం దత్తనాథక్షేత్రంలో శ్రీ రమా సహిత శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులు సామూహికంగా వ్రత పూజలు చేశారు.

జోరందుకున్న సార్వా సాగు

- వర్షాలు కురవడంతో వ్యవసాయ పనులు ముమ్మరం
- నియోజకవర్గంలో 47 శాతం వరి నాట్లు పూర్తి
- జూలై నాటికి నాట్లు పూర్తి చేయాలని లక్ష్యం



గుండుగొలనులో నాట్లు వేస్తున్న కూలీలు



వరి పొలాల్లో దమ్ము చేస్తున్న ట్రాక్టర్

భీమడోలు : నియోజకవర్గ వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురవడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. పుడమి తల్లికి పచ్చబొట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యాయి. కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ పథకంలో పెట్టుబడి సాయం అందించకపోవడం, ధాన్యం సొమ్ము ఆలస్యంగా రావడం, వర్షాలు సకాలంలో కురకపోవడంతో రైతులు ఖరీఫ్‌ను ఆలస్యంగా ప్రారంభించారు. ఇప్పటి వరకు వర్షాలు అంతంతమాత్రంగా కురిసి రైతులను నిరాశపర్చాయి. వారం రోజులుగా వర్షాలకు తొలకరి పనులు వేగవంతమయ్యాయి. మూడు రోజులుగా ఆశాజనకంగా వర్షాలు కురవడంతో డెల్టా పరిధిలోని గ్రామాల్లో వరి సాగు పనులు ఊరందుకున్నాయి. పూర్తిగా వర్షాధారమైన మెట్ట ప్రాంతాల్లో దమ్ము పూర్తి చేసి నాట్లు వేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 47 శాతం నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరి కాలువలో ప్రవాహం పెరగడం, చెరువులు, కాలువలు, పంట బోదెలు, ఊట కాలువలకు పూర్తి స్థాయిలో నీరు చేరింది. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా వరి నాట్లు మరింత ఊపందుకున్నాయి. గోదావరి కాలువకు 50 రోజులు క్రితం నీటి విడుదల చేసినప్పటికీ వర్షాలు లేనందున సాగు కొంత మేరకు ఆలస్యమైంది. దీనితో రైతులు నారుమడులు వేసి వర్షాల కోసం ఎదురుచూశారు. పంట తుఫాన్, భారీ వర్షాల బారిన పడకుండా కాపాడుకునేందుకు నాట్లు వేగంగా ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

మండలం	విస్తీర్ణం	పడిన నాట్లు (ఎకరాల్లో)
భీమడోలు	13,362	8,643
ఉంగుటూరు	23,672	13,005
నిడమర్రు	3,563	140
గణపవరం	11,713	2,664

ఉంగుటూరు నియోజకర్గంలో

ఉంగుటూరు నియోజకవర్గంలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపరం మండలాల్లో భీమడోలు మినహా మూడు మండలాలు డెల్టా పరిధిలో ఉన్నాయి. దీనితో వర్షాలపై ఆధారపడి సాగు చేస్తుండడంతో సాగులో జాప్యంలో జరిగింది. ఉంగుటూరు నియోజకవర్గంలో 52,310 ఎకరాలకు 24,452 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి కాగా 47శాతం నమోదైంది.

వరి నాట్లు వేగంగా పూర్తి చేయాలి



ఈ ఏడాది వర్షాలు కురవడం ఆలస్యం కావడంతో సార్వా సాగు పనులు మందగొడిగా ప్రారంభమయ్యాయి. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో రైతులు పీఎల్, 1318, స్వర్ణ రకాలు సాగు చేస్తున్నారు. 1121 రకాన్ని విత్తనాల కోసం సాగు చేస్తున్నారు. వరి నాట్లు జూలై నెలాఖరు నాటికి పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించాం.

డాక్టర్ పి.ఉషారాజకుమారి, ఏడీఏ, భీమడోలు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	25
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	26

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	66	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	10, 12
బెండకాయలు	34	కంద	50
పచ్చిమిర్చి	40-44	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-56	కీరా దోస	50
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	40	అల్లం	170
క్యాబేజీ	40	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36-54	పాలకూర	12
దొండకాయలు	34	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	56	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	--
ఆనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	94
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	44

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శాంతినగర్ సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. టీటీడీ కల్యాణ మండపం ప్రాంతం, సీఆర్ఆర్ కళాశాల ప్రాంతం, కలెక్టర్ బంగ్లా, జెడ్పీ బంగ్లా, గ్రేవియర్ హైస్కూల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఆర్ఎస్ఎస్‌ను పవన్ కొనియాడటం దుర్మార్గం

జంగారెడ్డిగూడెం: మహాత్మా గాంధీని హత్య చేసిన ఆర్ఎస్ఎస్ సంస్థ స్ఫూర్తి అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు చేగువేరా స్ఫూర్తి అని, నేడు ఆర్ఎస్ఎస్ స్ఫూర్తి అని పవన్ కల్యాణ్ పేర్కొనడం దుర్మార్గమన్నారు. ఆర్ఎస్ఎస్ సంస్థ దేనికి ఆదర్శం అని ప్రశ్నించారు. బ్రిటీష్ సామ్రాజ్యానికి తొత్తుగా వ్యవహరించిన సంస్థ ఆర్ఎస్ఎస్ అని అన్నారు. రైతు ఉద్యమంలో, మణిపూర్ దమన కాండలో మహిళలను హింసించి, అతి కిరాతకంగా చంపిన ఘటనలో, జార్ఖండ్ క్రిస్టియన్ పాస్టర్ల ఊచకోతలో ఆర్ఎస్ఎస్ పాత్ర విస్పష్టం అన్నారు. అలాంటి ఆర్ఎస్ఎస్ స్ఫూర్తి అని పవన్ కొనియాడడం సిగ్గుచేటన్నారు. పవన్ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు చైతన్య గోదావరి బ్యాంకు ప్రారంభం

దెందులూరు : చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖను గురువారం దెందులూరులో ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు మేనేజర్ టి నాగార్జున తెలిపారు.

సస్పెన్షన్లు ఉపసంహరించుకోవాలి



రాజ్యాంగ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా రీజనల్ పరిధిలోని అన్ని డిపోల్లో ఉద్యోగ సిబ్బంది అక్రమ సస్పెన్షన్లు, కేసులను ఉపసంహరించుకోవాలని వివిధ సంఘాల నాయకులు కోరారు. ఉగ్యోగ సిబ్బంది గ్రీవెన్స్ పరిష్కారం విషయంలో బహుజన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం, ఎంఆర్‌పీఎస్ సంఘం ఆధ్వర్యంలో ఏలూరు సీఐటీయూ కార్యాలయంలో బుధవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ సిబ్బంది అక్రమ సస్పెన్షన్లు, అక్రమ కేసులపై, ఇంక్రిమెంట్ల కోతపై ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకురాలు పి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తక్షణమే యాజమాన్యం కేసులు ఉపసంహరించుకుని భే షరతుగా ఉద్యోగంలోనికి తీసుకోవాలని కోరారు. అన్ని డిపోల్లో అక్రమ ఓడిలను అరికట్టి అర్హులకు అవకాశం కల్పించాలన్నారు. 2019/1 శిక్షాస్మృతులను అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అనుమానస్పద మృతిపై సీబీసీఐడి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. తొలుత భారత రాజ్యాంగ పుస్తకాన్ని పి.రాజ్యలక్ష్మి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గోరింక అనిల్ కుమార్, బహుజన ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఫరీద్ ఖాసిం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిర్రా శాంసన్, జిల్లా కార్యదర్శి టీకే రాజా, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పలివెల చంటి, రాష్ట్ర కార్మిక వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు దేవరపల్లి రత్నబాబు, రాష్ట్ర మహిళా కార్యదర్శి కాకి మరియమ్మ, బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి

పెదపాడు: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పర్చాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పెదపాడు మండలంలోని కొత్తముప్పర్రు, తాళ్లగూడెం, పాతముప్పర్రు, జయపురంలో బుధవారం ఆయన ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు మీ కోసం మీ చింతమనేని కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాం ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు లావేటి శ్రీనివాసరావు ఎంపీడీవో తేజరతన్, తహసీల్దార్ భావన్నారాయణ పాల్గొన్నారు.

అచ్చమ్మ తల్లి ఆలయాభివృద్ధికి విరాళం

దెందులూరు : గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి వడ్లపట్లకు చెందిన దాతలు ఉక్కుర్తి నాగవెంకట శివరామ్‌ప్రసాద్, నాగలక్ష్మి బుధవారం రూ.31,116 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలు శివరామ్‌ప్రసాద్‌ను సత్కరించారు.

అడవులు జీవ వైవిధ్య నిలయాలు

టి.నరసాపురం: కృష్ణాపురం గ్రామ అడవుల్లో బంజారా బజరంగీ భేరి కమిటీ ఆధ్వర్యంలో వేప, నేరేడు, జీడి, మామిడి, పనస, కుంకుడు, సీతాఫలం తదితర విత్తనాలు బుధవారం చల్లారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ అడవులు జీవ వైవిధ్య నిలయాలని అన్నారు. సీతలా భవాని అడవులను రక్షించి పశువులను, మానవులను కాపాడే బంజారాల వన దేవత అని, ఆమెను పూజించే కార్యక్రమంలో భాగంగా విత్తనాలు చల్లే కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ అడవులు వేగంగా అంతరించి పోతున్న క్రమంలో వాటిని కాపాడుకోడానికి లక్ష విత్తనాలు చల్లే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు జరభల కృష్ణ ప్రసాద్, భూక్యా బిగనాధం, ధరావత్ రవి, బంగారయ్య, హసావత్ రవీంద్ర, భూక్యా రాములు, శ్రీనివాస్, భూక్యా చంటి, సురేష్, బద్దుబాబు, జరభల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.